సాక్షి
వికారాబాద్

సోమవారం ၊ 27 ၊ ఫిబ్రవరి ၊ 2023



ఇదేం నిర్వహణ!
పాఠశాల ఒక్కటే కానీ వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తుండడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



'హెల్పింగ్ ఫండ్'
ఆపదలో ఉన్న తమ స్నేహితులకు చేయూత ఇవ్వడానికి చిన్ననాటి స్నేహితులంతా ఒక్కటయ్యారు. 8లో▸



సెంట్రల్ లైటింగ్ ఎప్పటికో..!
కోట్‌పల్లి ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై డివైడర్లు ఏర్పాటు చేసిన అధికారులు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ మరిచారు. 9లో▸

ప్రారంభించి ఆరేళ్లు..
పనులు ఎన్నేళ్లు?

పునాదులు దాటని డబుల్ బెడ్రూం ఇళ్లు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లు
- కొత్త కలెక్టర్ రాకతోనైనా దశమారేనా?

జిల్లాకు మంజూరైనవి:	3,800
నిర్మాణ దశలో ఉన్నవి :	2,257
ప్రారంభానికి నోచుకోనివి:	1543



జిల్లా కేంద్రంలో పునాది దశలోనే ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం

వికారాబాద్: పేదవాడికి సొంతింటి కల నెరవేర్చాలన్న సదాశయంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్రూం పథకం మూడడుగులు ముందుకు ఏడడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోంది. ప్రారంభించి ఆరేళ్లయినా ఇంకా సగం ఇళ్లు కూడా పూర్తి కాకపోవటం గమనార్హం. గిట్టుబాటు కావడం లేదనే కారణంతో ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. సొంత ఇళ్లు లేని నిరుపేదలకు ఆధునిక హంగులతో రెండు పడకల గదుల ఇళ్లను నిర్మించి ఇస్తామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో టీఆర్‌ఎస్ పొందుపరిచింది. అధికారంలోకి రాగానే 2016లో ఆర్భాటంగా డబుల్ బెడ్రూం ఇళ్లకు భూమిపూజ చేసింది. ఆరు సంవత్సరాల కాలంలో జిల్లాలో మంజూరైన ఇళ్లలో సగం ఇళ్లను కూడా పూర్తిచేయలేకపోయింది. దీంతో పేదోడి సొంతిటి కల కలగానే ఉండిపోయింది. ఒక్క లబ్ధిదారునికి సైతం ఇంటిని అప్పగించలేదు. దీంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఈ పథకం అభాసుపాలవుతోంది.

మార్చి నెలాఖరులోగా..

అయితే డబుల్ బెడ్రూం ఇళ్ల పనుల వేగం పెంచి జనవరి 15 నాటికి పేదలకు అందజేయాలని ప్రభుత్వం మూడు నెలల క్రితమే కలెక్టర్లను ఆదేశించింది. అయినా పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి. ఇటీవల ప్రస్తుత కలెక్టర్ డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించడంతో పాటు రెగ్యులర్‌గా సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నారు. మార్చి నెలాఖరులోగా నిర్మాణ దశలో ఉన్న ఇళ్లన్నీ పూర్తి చేయాలని అధికారులను ఇప్పటికే ఆదేశించారు. అయితే సమీక్షలకే పరిమితమవుతారా? లేక ఆరు సంవత్సరాలుగా పూర్తి చేయని ఇళ్లు మరో నెల రోజుల గడువులోగా టార్గెట్ పూర్తి చేసి పేదలకు అందిస్తారా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

నిర్మాణ దశలో 2,257 ఇళ్లు


నూతనంగా ఆవిర్భవించిన వికారాబాద్ జిల్లాకు ఆరు సంవత్సరాల క్రితం మొత్తం 5,740 డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణ సారథ్య బాధ్యతలను ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖకు అప్పగించింది. వారు చేతులెత్తేయడంతో కొన్ని చోట్ల ఆర్‌అండ్‌బీ, ఇంకొన్ని చోట్ల పంచాయతీ రాజ్ శాఖలు పర్యవేక్షిస్తున్నాయి. అయితే ఆ సమయంలో ఇళ్ల నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాలేదు. తాండూరు, కుల్కచర్ల, మోమిన్‌పేట, పరిగి తదితర ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించినా అందులో మెజార్టీ ఇళ్లు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. అనంతరం మంజూరు చేసిన ఇళ్ల సంఖ్యను 3,800కు కుదించారు. ఇందులో 2,257 ఇళ్లు నిర్మాణంలో ఆయా దశలలో ఉన్నాయి. ఇందులో ఎక్కువ శాతం పునాదులు, స్లాబ్‌ల దశలోనే ఉన్నాయి. 1,543 ఇళ్లు ఇంకా ప్రారంభానికి కూడా నోచుకోలేదు. ఇసుక ధరలు పెరిగిపోవడం, ప్రభుత్వం అందించే ఇళ్ల ధరకు నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరగడం, ఇసుక తరలింపులో ప్రభుత్వ తీవ్రమైన ఆంక్షలు, గిట్టుబాటు కాని ధరలతో ఈ ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. బలవంతంగా వారికి అంటగట్టినా.. వారి పనులు నత్తను తలపిస్తున్నాయి.

నాణ్యత అంతంతే..

ఎమ్మెల్యేలు మంత్రుల వత్తిడులతో డబుల్ బెడ్రూం నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు ఏ మాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ముందే వారితో బలవంతగా టెండర్లు వేయించటం.. పనులు ప్రారంభించేలా వత్తిడి చేసి ఒప్పిస్తుండటంతో వారు పనుల్లో నాణ్యత పాటించడంలేదు. ఇసుకకు బదులు డస్ట్ వాడుతున్నారు. ఇటీవల జిల్లాలో పలువురు ప్రజా సంఘాల నాయకులు నాణ్యత పాటించడం లేదంటూ ఆందోళనకు దిగడంతో పాటు అధికారులకు ఫిర్యాదులు సైతం చేశారు. అయినా నాణ్యత విషయంలో వారి పంథా మార్చుకోకపోవడం గమనార్హం.

భానుడి భగభగ

- జిల్లాలో 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- వడగాడ్పులు.. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి



బషీరాబాద్: వేసవి ఆరంభంలోనే భానుడి భగభగలు మొదలయ్యాయి. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. జనవరి చివరి వారంలో గరిష్టంగా పగటి ఉష్ణోగ్రత 30 డిగ్రీలుగా నమోదైతే, ఫిబ్రవరి మూడో వారం నుంచి 32 నుంచి 35 డిగ్రీలకు చేరుకుంది. ఆదివారం తాండూరులో 36 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో తాండూరు ప్రాంతంలోనే వేసవిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ ప్రాంతంలోని బషీరాబాద్, తాండూరు మండలాల్లో విస్తారంగా నాపరాతి గనులు, భారీ సిమెంట్ పరిశ్రమలు ఉండటం కారణాలుగా చెప్పవచ్చు. ఇది మార్చి మొదటి వారం వరకు 38 డిగ్రీలకు చేరవచ్చని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మధ్యాహ్నం12 గంటలకే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. అలాగే వడగాల్పులు కూడా ప్రారంభం కావడంతో పగటి పూట జనం రోడ్లపైకి రావడానికి జంకుతున్నారు. రాత్రి వేళ ఉక్కపోతగా ఉండడంతో జనం కూలర్లు కొనుగోలు చేస్తున్నారు. పల్లెల్లో జనం ఆరుబయట నిద్రిస్తున్నారు.

ఉత్సాహంగా పర్వతారోహణ



భువనగిరి ఖిల్లాపై వసతిగృహ విద్యార్థులు

భువనగిరి ఖిల్లాపై ముగిసిన శిక్షణ

వికారాబాద్ అర్బన్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థినీవిద్యార్థులకు పర్వతారోహణంపై శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన విద్యార్థులను శిక్షణ కోసం యాదాద్రి భువనగిరి ఖిల్లాకు తీసుకెళ్లినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్ తెలిపారు. విద్యార్థులు మొదటి రోజు పర్వతారోహణ చేసేందుకు కొంత భయపడ్డారాని, అక్కడ ఉన్న సిబ్బంది పూర్తి స్థాయిలో మనోధైర్యం కల్పించడం, పలు మెలకువలు చెప్పడంతో రెండో రోజు విద్యార్థులందరూ పర్వతారోహణం చేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజన సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ వెలికివస్తుందన్నారు. ఈ కార్యక్రమం చేపట్టినందుకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సెక్రటరీ, కమిషనర్ బుర్రా వెంకటేశంకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదివారం సెలవుతో అవస్థలు



జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వికారాబాద్ అర్బన్: జిల్లాలో పాలనను చక్కదిద్దేందుకు కలెక్టర్ నారాయణ రెడ్డి జియో అటెండెన్స్ యాప్‌ను తీసుకొచ్చారు. అన్నీ శాఖల ఉద్యోగులు రోజూ ఈ యాప్‌లోనే హాజరు వేసుకోవాలని ఆదేశించారు. ఇక్కడివరకు బాగానే ఉన్నా మున్సిపాలిటీలో ప్రధానంగా వికారాబాద్ మున్సిపాలిటీలో ఇబ్బందులను తెచ్చిపెడుతుంది. వికారాబాద్‌లో ప్రతి మంగళవారం వ్యాపార సముదాయాలకు సెలవు ఉంటుంది. అన్నీ రకాల వ్యాపారాలు ఆ రోజు బంద్ ఉంటాయి. పట్టంలోని ప్రధాన రోడ్లు గుండా ఎలాంటి వ్యర్థాలు పడవు. దీంతో మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం వారాంతపు సెలవు ఇచ్చారు. కొత్తగా వచ్చిన జియో అటెండెన్స్ యాప్ కారణంగా ఆదివారం పనిచేశాక హాజరు వేసుకుందామంటే పడటం లేదు. ఈ నేపథ్యంలో వారికి కూడా వారాంతపు సెలవు మార్చారు. ఇదిలా ఉంటే.. ఆదివారం వికారాబాద్‌లో జరిగే అంగడికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు, పశువుల సంత, కూరగాయాల మార్కెట్ పెద్ద ఎత్తున జరుగుతుంది. దీంతో పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. పారిశుద్ధ్య కార్మికులకు గతంలో మాదిరిగానే మంగళవారం సెలవు ఇచ్చి ఆదివారం విధులు నిర్వహిస్తే పట్టణం శుభ్రంగా ఉండే అవకాశం ఉందని వ్యాపారులు కోరుతున్నారు.

కనులపండువగా బొడ్రాయి వేడుకలు

కొడంగల్ మండలం ఆలేడ్ గ్రామంలో బొడ్రాయి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తిశ్రద్ధలతో బొడ్రాయిని ప్రతిష్ఠించి మూడు రోజులుగా ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం చివరి రోజు బోనాలతో తరలివచ్చి నైవేద్యాలను సమర్పించారు. అందరూ చల్లంగా ఉండాలని వేడుకున్నారు. – కొడంగల్ రూరల్



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఉల్లి ధర ధమాల్



వికారాబాద్ ప్రధాన రోడ్డులో ట్రాక్టర్‌పై ఉల్లిపాయలు అమ్ముతున్న రైతులు

వికారాబాద్ అర్బన్: ఉల్లి ధర అమాంతం తగ్గింది. దీంతో రైతులు ఉల్లిని మార్కెట్‌కు తీసుకెళ్లకుండా నేరుగా బజారులో సంచి లెక్కన వినియోగదారులకు అమ్మేస్తున్నారు. 50 కిలోల ఉల్లి సంచి రూ. 500లకు అమ్ముతున్నారు. ఉల్లిని బీట్ల మార్కెట్‌కు తరలిస్తే ధర మరింత తక్కువ పలకడం.. కమీషన్ ఏజెంట్లకు డబ్బులుఇవ్వాల్సి వస్తుండటంతో రైతులకు ఏమాత్రం మిగలడం లేదు. దీంతో ఆదివారం వికారాబాద్‌లో సంత ఉండటంతో గ్రామాల నుంచి ట్రాక్టర్లలో ఉల్లిని తీసుకొచ్చి అమ్ముతున్నారు. కిలోకు రూ.5కంటే తక్కువ లభిస్తుండటంతో వినియోగదారులు కొనడానికి ఆసక్తి చూపుతున్నారు.

ధ్యానంతోనే మానసిక దృఢత్వం

- కేంద్ర సమాచార, ప్రసారాలు, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాగూర్
- కాన్హాలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సెంటర్ ప్రారంభం



కాన్హాలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి అనురాగ్ ఠాగూర్

నందిగామ: ప్రతి ఒక్కరూ ధ్యానం చేసినట్లయితే మానసికంగా ఎంతో దృఢంగా ఉంటారని కేంద్ర సమాచార, ప్రసారాలు, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాగూర్ అన్నారు. నందిగామ మండలంలోని కాన్హా శాంతి వనంలో ఆదివారం హార్ట్‌ఫుల్ నెస్ మినిస్ట్రీ ఆఫ్ స్పోర్ట్స్, ఖేలో ఇండియా, ఎఫ్ఐటీ ఇండియా, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ సంయుక్త సహకారంతో నిర్మించిన హార్ట్‌ఫుల్‌నెస్ అంతర్జాతీయ స్పోర్ట్స్ సెంటర్‌ను రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్, బ్యాడ్మింటన్ కోచ్ పులెల్ల గోపీచంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, నిరంతరం ధ్యానం, యోగతో పాటు చిన్నపాటి వ్యాయామం దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. 'ఫిట్‌నెస్ కా డోస్.. అరగంట మస్ట్' అనే నియమాన్ని పాటించాలన్నారు. కాన్హా శాంతి వనంలో ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన మందిరం, యోగా, క్రీడలు అన్నీ ఒకేచోట సమకూర్చడం చాలా గొప్ప విషయమని అన్నారు. ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నించాలని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శ్రీ రామచంద్ర మిషన్ చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, వాటికి ప్రభుత్వ మద్దతు ఉంటుందని చెప్పారు. బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం ఆవరణలో క్రీడా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గురూజీ కమ్లేష్ పటేల్ ఆలోచన అద్భుతంగా ఉందన్నారు. ఈ కేంద్రంలో 14 బ్యాడ్మింటన్ కోర్టులు, 3 స్క్వాష్ కోర్టులు, 20 మీటర్ల స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయన్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న వారికి ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గురూజీ కమ్లేష్ పటేల్ మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా ధ్యానం చేసినట్లయితే అంతర్గతంగా మార్పు వస్తుందన్నారు. నైపుణ్యం గల శిక్షకులతో ఇక్కడ క్రీడాకారులకు శిక్షణ ఇప్పించి అంతర్జాతీయ స్థాయికి వెళ్లేలా కృషి చేస్తామని అన్నారు. అంతకు ముందు గ్రీన్ కాన్హా రన్ నిర్వహించారు. 5కే, 10కే, 21కే రన్ విజేతలకు బహుమతులు అందజేశారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి



మాట్లాడుతున్న సదానంద రెడ్డి

అనంతగిరి: రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్ మండలంలోని పీరంపల్లి గ్రామంలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను విస్మరించిందన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానన్న సీఎం ఇప్పటివరకు ఇవ్వలేదని మండిపడ్డారు. పైగా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. జిల్లాకు ఇప్పటివరకు సాగునీరు అందించలేదన్నారు. ప్రధాని మోదీ పాలనతోనే దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి బీజేపీ చేపడుతున్న పథకాల గురించి చెప్పాలన్నారు. పార్టీ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. దేశంలో మరోసారి బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి బసవలింగం, మండల ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు అశోక్, పార్టీ బూత్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిని దూషించాడని స్నేహితుడి హత్య

బండరాయితో మోది.. బండరాళ్లలో పడేసిన వైనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ అంజయ్య



మృతుడు మహ్మద్ షా ఫైసల్ (ఫైల్)

పహాడీషరీఫ్: తల్లిని దూషించడాన్ని తట్టుకోలేక స్నేహితుడిని దారుణంగా హతమార్చిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం ఏసీపీ అంజయ్య, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌తో కలిసి ఆదివారం కేసు వివరాలు వెల్లడించారు. ఉస్మాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ జాఫర్ కుమారుడు మహ్మద్ షా ఫైసల్ (25) ఈనెల 12న రాత్రి స్నేహితుడైన షాహిన్‌నగర్ మినార్ కాలనీకి చెందిన అబ్దుల్ జబ్బార్‌కు కాల్ చేసి అతని ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లి కాసేపు ముచ్చటించారు. బయటకి వెళ్దామని అప్పటికే మద్యం తాగి ఉన్న ఫైసల్ అడగడంతో జబ్బార్ నిరాకరించాడు. దీంతో ఫైసల్ తల్లి పేరుతో తీవ్రంగా దూషించాడు. ఆగ్రహానికి గురైన జబ్బార్ కర్రతో బాదడంతో ఫైసల్ స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే జబ్బార్ బండరాయితో మోది అతన్ని హత్య చేసి బండరాళ్లలో పడేసి.. మృతదేహం కనిపించకుండా చెత్తా చెదారంతోపాటు ఖాళీ సిమెంట్ సంచులను పడేసి వచ్చేశాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు మొదట మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫోన్‌పై నిఘా ఉంచగా.. సిమ్ మార్చి చాంద్రాయణగుట్టకు చెందిన సయ్యద్ షహీద్ వాడుతున్నట్లు తేలింది. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా జబ్బార్ నుంచి కొనుగోలు చేసినట్లు తేలింది. పోలీసులు జబ్బార్‌ను అదుపులోకి తీసుకొని విచారించడంతో అసలు విషయం వెలుగు చూసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. హత్యకు వినియోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

తాండూరు: తాండూరు, వికారాబాద్ ఆర్టీసీ డిపోల పరిధిలో సమస్యలు ఉంటే ప్రయాణికులు నేరుగా ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించారు. సోమవారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాలోని ఆర్టీసీ డిపోల పరిధిలో నెల కొన్న సమస్యలను ఆర్‌ఎం దృష్టికి తీసుకురావాలని డిపో అధికారులు కోరారు. 99592 26341 నంబర్ ద్వారా డయల్ చేయాలని పేర్కొన్నారు.

మూన్‌వాక్ వంశీకృష్ణకు కేంద్రమంత్రి అభినందనలు



అనురాగ్ ఠాకూర్‌తో వంశీకృష్ణ

తాండూరు: పట్టణానికి చెందిన మూన్‌వాక్ వంశీకృష్ణను కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అభినందించారు. ఇటీవల ఆత్మరక్షణ విద్య (కరాటే)లో నాంచాకు ఇండియా బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో నేషనల్ రికార్డును వంశీకృష్ణ సాధించారు. కేవలం ఒక సెకనులో నాంచాకును 9 సార్లు వేగవంతంగా తిప్పారు. ఆదివారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో వంశీని కేంద్ర మంత్రి అభినందించారు.

బసవేశ్వరుని ఆశయాలను సాధిద్దాం

రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న శుభప్రద్‌పటేల్

పరిగి: బసవేశ్వరుని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ సూచించారు. ఆదివారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన వీరశైవ లింగాయత్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల రహిత సమాజ స్థాపనకు కృషి చేసిన వ్యక్తి బసవేశ్వరుడని కొనియాడారు. దానం, ధర్మం, సమసమాజం కోసం పాటుపడిన సామాజిక వేత్త అని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప ఆధ్యాత్మిక వేత్త అని అన్నారు. బసవేశ్వరుడి ప్రవచనాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వీరశైవ లింగాయత్‌లు ఏకమై అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలని రాష్ట్ర బీసీ కమిషన్ తరఫున జాతీయ బీసీ కమిషన్‌కు సిఫారసు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకునేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సంగమేశ్వర్, అధ్యక్షుడు ఈశ్వరప్ప, పరిగి అధ్యక్షుడు శివరాజ్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, మహిళా అధ్యక్షురాలు అనూష, గుర్మిట్కల్ మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఉన్నత స్థాయికి చేరాలి



విద్యార్థులకు బెల్ట్, సర్టిఫికెట్లను అందజేసిన సబ్ జైల్ సూపరింటెండెంట్ రాజ్ ప్రకాశ్

పరిగి: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సబ్ జైల్ సూపరింటెండెంట్ రాజ్ ప్రకాశ్ అన్నారు. పరిగి పట్టణంలో తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కరాటే పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మార్షల్ ఆర్ట్స్ కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో అర్హత సాధించిన 30 మంది విద్యార్థులకు బెల్ట్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ కోచస్ ఇర్ఫాన్, చారి, బద్రి, ఇమామ్, నిఖిల్, వినోద్, గాయత్రి, మసూద్, సల్మాన్, ముక్తార్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అందరి సహకారంతో గ్రామాభివృద్ధి

సర్పంచ్ సునీత



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సునీత, నాయకులు

మోమిన్‌పేట: అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని సర్పంచ్ సునీత పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అంరాధికుర్దు గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.35లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో డంపింగ్ యార్డు, వైకుంఠధామం, క్రీడా ప్రాంగణం నిర్మించినట్లు తెలిపారు. మిషన్ భగీరథతో ప్రతి ఇంటికీ తాగు నీరు అందుతోందని తెలిపారు. 10 నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు నిధులను విడుదల చేయడం లేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పంచాయతీ కార్మికులకు, ట్రాక్టర్ డీజిల్ పోసేందుకు కూడా డబ్బులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక నిధులను విడుదల చేస్తే గ్రామంలో భూగర్భ డ్రైనేజీ నిర్మిస్తామని పేర్కొన్నారు. వార్డు మెంబర్లు, నాయకులు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి పూర్వ విద్యార్థుల సాయం



చౌదర్‌పల్లిలో పూర్వ విద్యార్థుల బృందం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 2008–09 పదో తరగతి బ్యాచ్ 50 మంది పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వీరిలో చౌదర్‌పల్లికి చెందిన వరుణ్ కుటుంబం ఆరోగ్య పరిస్థితి బాగాలేనందున అప్పటికప్పుడు కొంత నగదును పోగుచేసి అందజేశారు. చౌదర్‌పల్లికి చెందిన లలిత పంచాయతీ కార్యదర్శిగా, పాలబాయితండాకు చెందిన డి.శ్రీనివాస్ రైల్వే ఉద్యోగిగా, మరి కొందరు ప్రైవేట్ ఉద్యోగులుగా పనిచేస్తూ ఉన్నారని అన్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు కుర్మయ్య, వెంకటయ్యను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయ్, నర్సిములు, లక్ష్మణ్, హన్మంతు, రాజు ఆనంద, శారద, మాధవి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్

మర్పల్లి: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మర్పల్లిలో ఎస్‌కేఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం మర్పల్లి, సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం నిలిగిరిపేట్ జట్లు తలపడ్డాయి. నిలిగిరిపేట్ జట్టు విజయం సాధించింది. పోటీలు మరో 5 రోజుల పాటు సాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటి వరకు 50 జట్లు పోటీల్లో పాల్గొన్నట్లు వారు తెలిపారు.

పడుడు.. పక్కా



బీజేఆర్ చౌరస్తాలో ఒరిగిన ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభం

వికారాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని బీజేఆర్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడానికి తోడు ఆ స్తంభం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. సిగ్నల్స్ స్తంభాన్ని గతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో పూర్తిగా ఒక వైపునకు వంగింది. ఎప్పుడు వాహనాలతో రద్దీగా ఉండే చౌరస్తాలో వాహనాలు వెళ్లే సమయంలో ఆ స్తంభం కిందపడితే పెద్ద ప్రమాదమే జరిగే అవకాశం ఉంది. వెంటనే స్తంభాన్ని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇదేం నిర్వహణ..!

- పాఠశాల ఒక్కటే.. నిర్వహణ రెండు చోట్ల
- బషీర్‌మియా తండా ప్రాథమిక పాఠశాలలో వింత పరిస్థితి
- తండాతో పాటు రాజీవ్ కాలనీలో వేర్వేరు భవనాలు
- ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు
- పట్టించుకోని అధికారులు



పాఠశాల ఒక్కటే వేర్వేరు ప్రాంతాల్లోని భవనాలు



యాలాల: పాఠశాల ఒక్కటే కానీ వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తుండడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయుల మధ్య అంతరం పెరిగిపోయి కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. మండలంలోని బషీర్‌మియా తండాలోని ప్రాథమిక పాఠశాలలో 23 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. కాగా తండాకు కిలోమీటరు దూరంలోని రాజీవ్ గృహకల్ప నుంచి తండా పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థులకు ఇబ్బంది అవుతుందనే భావనతో కాలనీలో భవనాలను నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ తెలుగు, ఉర్దూ మీడియంలో 120 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ రెండు పాఠశాలలకు లక్ష్మీనారాయణ హెచ్‌ఎంగా వ్యవహరిస్తున్నారు. హెచ్‌ఎం ఒక పాఠశాలలో మిగితా సిబ్బంది మరో పాఠశాలలో విధులు నిర్వహిస్తుండడంతో పలు రకాల సమస్యలు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు రాజీవ్ కాలనీలో ఉర్దూ మీడియం సైతం ఒకే చోట ఉండడం, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. మన ఊరు – మన బడి కార్యక్రమానికి ఈ పాఠశాల ఎంపికయ్యింది. దీంతో కొత్త మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మాణం కోసం పాత వాటిని కూల్చేశారు. ఈ కారణంగా ఉపాధ్యాయులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

ఒక చోట సెలవు.. మరో చోట కొనసాగింపు

రెండు వేర్వేరు చోట్లా పాఠశాల తరగతులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు వింత అనుభవం ఎదురవుతోంది. ఇటీవల సేవాలాల్ జయంతి సందర్భంగా బషీర్‌మియా తండా పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ గ్రామ సర్పంచ్ అనుమతితో స్కూల్‌కు లోకల్ హాలీడే ప్రకటించి ఇంటికి వెళ్లిపోయారు. కాగా అదే రోజు రాజీవ్ కాలనీలో మాత్రం యథావిధిగా తరగతులు నిర్వహించారు. ఒకే పేరు మీద కొనసాగుతున్న పాఠశాలకు ఒక చోట సెలవు, మరో చోట తరగతులు నిర్వహించడం వింతగా అనిపించింది. విద్యాశాఖ ఉన్నతాధికారులు బషీర్‌మియా తండా పాఠశాల నుంచి రాజీవ్ కాలనీ పాఠశాలను వేరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

బషీర్‌మియా తండా, రాజీవ్ కాలనీలో ఒకే పేరిట పాఠశాలలు కొనసాగుతున్నాయి. దీంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పాఠశాల విభజన కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే బషీర్‌మియా తండా నుంచి రాజీవ్ కాలనీ పాఠశాలను వేరు చేసి తరగతులు నిర్వహిస్తాం.

– సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ, యాలాల

క్రీడలతో మానసికోల్లాసం



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

పూడూరు: క్రీడలతోనే మానసికోల్లాసం, దేహదారుఢ్యం పెంపొందుతుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మేడిపల్లి కలాన్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలని అన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో క్రీడలు ఆడాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేఘమాల, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అజారుద్దీన్, రహీస్‌ఖాన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.



'మామిడి పూసి మామిడి కాసెనా.. మదానో నావయ్యారి' జానపదులు పాడుకునే పాటలకు తగ్గట్టు మామిడి కాతకొచ్చాయి. రెండు వారాల క్రితం మాఘ మాసం మొదట్లోనే పూత పూసి కాత కాసింది. వర్షాలు, మంచు కారణంగా ఈ సారి మామిడి కాత తగ్గింది. ఉగాది పచ్చళ్లకు మామిడి కొంత ప్రియంగానే ఉంటుందని వ్యాపారులు భావిస్తున్నారు. – బొంరాస్‌పేట

అహింస, ప్రేమ సత్యసాయి మార్గం



బహుమతులు పొందిన విద్యార్థులతో కృష్ణమూర్తి తదితరులు

అనంతగిరి: ప్రేమ, అహింస సత్యసాయి మార్గమని, యువత ఆయన బాటలో పయనించాలని గీతం యూనివర్సిటీ ప్రొ. కృష్ణమూర్తి సూచించారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని సత్యసాయి జ్ఞాన కేంద్రంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా యువజన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో యువతలో మానవతా విలువలు పెంపొందించుటకు సత్యసాయి సేవా సంస్థలు వేదికలా పని చేస్తాయన్నారు. నేటి సమాజంలో జరుగుతున్న దుష్పరిణామాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరినీ మంచి నడవడికలో పయనించేలా చూడాలన్నారు. సత్యసాయి బోధనలు సత్యదర్మ శాంతి, ప్రేమ, అహింస మార్గాలను ప్రతి ఒక్కరిలో పెంపొందించడానికి సాయి యువత ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన పాఠశాల, కళాశాలల విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యువ సమన్వయకర్త నాగరాజు, జిల్లా డీవైసీ బసవేశ్వర్, కన్వీనర్ సత్యనారాయణగౌడ్, బందెప్ప గౌడ్, ప్రేమ్, వీరేశం, రామకృష్ణ, వెంకటరెడ్డి, సేవాదళ్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్నేహితుల చేయూతకు 'హెల్పింగ్ ఫండ్'

- పేద దోస్తుల శుభకార్యాలకు ఆర్థిక సాయం
- ప్రత్యేక నిధి ఏర్పాటు
- పూర్వ విద్యార్థుల వినూత్న ఆలోచన



ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు

బషీరాబాద్: ఆపదలో ఉన్న తమ స్నేహితులకు చేయూత ఇవ్వడానికి చిన్ననాటి స్నేహితులంతా ఒక్కటయ్యారు. వారికి సాయం చేయడానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసుకున్నారు. తమ స్నేహితుల్లో పేదరికంలో ఉన్న వారి ఇళ్లల్లో శుభకార్యం జరిగితే వారికి ఆర్థిక సాయం చేయడానికి సిద్ధమయ్యారు. వివరాల్లోకి వెళితే.. బషీరాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1991 – 92 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కాగ్నానది ఒడ్డున వెలసిన సంగమేశ్వర ఆలయంలో వీరంతా కలిసి చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో, పలు వృత్తుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ బ్యాచ్‌లోని పేద స్నేహితులకు హితోధికంగా సాయం చేయడానికి 'హెల్పింగ్ ఫండ్'ను ఏర్పాటు చేశారు. గతేడాది గోవింద్ అనే స్నేహితుడి కూతురు వివాహానికి రూ.75 వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే బషీరాబాద్‌కు చెందిన మరో స్నేహితుడు ప్రదీప్ కూతురి ఉన్నత చదువులకు రూ. 50 వేల ఆర్థిక సాయం ఇచ్చారు. ఈ ఏడాది కూడా మరికొందరికి ఆర్థిక సాయం చేయడానికి నిధులు సమకూస్తున్నట్లు ఈ బ్యాచ్ లీడర్ రవీందర్‌రావు తెలిపారు. చిన్ననాడు ఆర్థిక అసమానతలు లేకుండా ప్రభుత్వ పాఠశాలలో ఒకే రకమైన డ్రస్ కోడ్‌తో చదువుకున్నామని అన్నారు. ఇప్పుడు ఆర్థికంగా స్థిరపడిన స్నేహితులంతా కలిసి పేద స్నేహితులకు ఆదుకునే విధంగా ప్రణాళిక తయారు చేసినట్లు చెప్పారు. ఇది తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితులు చెన్నారెడ్డి, పాండురంగారెడ్డి, చంద్రశేఖర్, రాజశేఖర్, శ్రావణ్‌కుమార్, ప్రదీప్‌కుమార్, నాగరాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట అవినీతి

- సీఎం కేసీఆర్‌పై మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ ఫైర్
- ధారూర్ బహిరంగ సభలో కార్యకర్తలకు దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

ధారూరు: హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధారూరులో ఆదివారం నిర్వహించిన ఊరేగింపులో మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం ధారూరులోని జెండాబావి దగ్గర ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ, సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇస్తే.. అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరిట రూ.1.15 లక్షల కోట్ల మేర అవినీతి చేశారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు, స్థలాలు అమ్ముకుని రూ.లక్షల కోట్లు కూడబెట్టారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ హయాంలో జిల్లాలో సర్పన్‌పల్లి, కోట్‌పల్లి, లక్నాపూర్ తదితర ప్రాజెక్టులను నిర్మిస్తే బీఆర్‌ఎస్ పార్టీ ఇక్కడ ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేకపోయిందని అన్నారు. అమలుకాని హామీలతో రెండుసార్లు అధికారం చేపట్టిన సీఎం కేసీఆర్‌ను ఈ సారి ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అంతకుముందు అంబేడ్కర్ చౌరస్తాలో ప్రసాద్‌కుమార్‌ను మైనారిటీలు గజమాలతో సత్కరించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు, సర్పంచ్ పాండునాయక్, నాయకులు మహ్మద్ బాబాఖాన్, అమరేశ్వర్‌రావు, బల్వంత్‌రెడ్డి, మాన్‌సింగ్, నారాయరణరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు..

బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ వార్డు సభ్యురాలు దోర్నాల్ పద్మమ్మ, బార లక్ష్మయ్యతో పాటు 35 మంది మైనారిటీ యువకులు మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

యువత క్రీడల్లో రాణించాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు

తాండూరు రూరల్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సంగెంకలాన్ గ్రామంలో బీఆర్‌ఎస్ మండల బీసీసెల్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ తాత 'లోకయ్యగౌడ్' స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అంతకుముందు లోకయ్యగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం అతిథులు, నిర్వాహకులు కాసేపు క్రికెట్ ఆడి యువతను ఉత్సాహపరిచారు. చంద్రశేఖర్‌గౌడ్ అతిథులను సన్మానించారు. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాందాస్, సర్పంచ్ రాజప్ప, నాయకులు ఉమాశంకర్, చెన్‌గేస్‌పూర్ ప్రవీణ్, హుసేన్ పటేల్, రాకేష్ గౌడ్, రాజేందర్‌రెడ్డి, కామిని శ్రీను, తిరుమలేశ్, వెంకట్‌రెడ్డి, బస్వ రాజ్, సునీల్‌కుమార్, లింగప్ప, కుషాలభాయ్, గైబప్ప, రమేష్, గోపాల్, నరేందర్, గణేష్, కృష్ణ, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ 'దళితబంధు' ఇవ్వాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్



మహిళలతో బీజేపీ నేత రమేష్‌కుమార్

తాండూరు రూరల్: నియోజకవర్గంలోని నిరుపేద దళితులందరికీ దళితబంధు పథకం ఇవ్వాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్‌లో ప్రజాగోస –బీజేపీ భరోసా, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. రాష్ట్రంతో పాటు తాండూరులో కూడా ప్రజలు బీజేపీ వైపు ఉన్నారన్నారని చెప్పారు. తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్.. ఆ తర్వాత ఉద్యమ ద్రోహులకు పెద్దపీట వేసిందన్నారు..తెలంగాణాలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. దళితులకు దళితబంధుతో పాటు మూడు ఎకరాల భూమి ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో ఒక్కరికి కూడా డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శేఖాపూరం ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్, నాయకులు రవిగౌడ్ ,బాలరాజు ,మహిళలు ఉన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతం

అధ్యక్షుడిగా అబ్దుల్ గని ఘన విజయం

తాండూరు: తాండూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని వైట్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఎన్నికల ఇన్‌చార్జ్, ప్రముఖ న్యాయవాది కే గోపాల్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. రెండు నెలలుగా ఎన్నికలపై ఉత్కంఠ వాతావరణం నెలకొంది. గతంలో అధ్యక్ష రేసులో ఉన్న హబీంఖాన్, ఇర్ఫాన్ పోటీ నుంచి తప్పుకున్నారు. తర్వాత మాజీ కౌన్సిలర్ ఇర్ఫాన్ అబ్దుల్ గనికి మద్దతు పలికారు. మరో అభ్యర్థి రేసులో శ్రీనివాస్ నామినేషన్ వేశారు. దీంతో రెండు రోజుల పాటు ఇద్దరు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం సాయంత్రం వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 243 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 6 గంటలకు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడించారు. అబ్దుల్ గనికి 211 ఓట్లు, శ్రీనివాస్‌కు 16 ఓట్లు వచ్చాయి. దీంతో లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం విజయం సాధించిన అబ్దుల్ గనికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన అధ్యక్షుడు గనికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్, మాజీ కౌన్సిలర్ ఇర్ఫాన్, ఎన్నికల ఇన్‌చార్జ్ గోపాల్ శుభాకాంక్షలు తెలిపారు.



అబ్దుల్‌గనిని సన్మానిస్తున్న నాయకులు

గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

జెడ్పీటీసీ నాగిరెడ్డి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి, తదితరులు

దోమ : గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఉన్న 36 గ్రామ పంచాయతీలకు రూ.3 కోట్ల 74 లక్షలు మంజూరు అయ్యాయని, వాటితో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేయిస్తున్నామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యతలు పాటించేలా చూడాలన్నారు. సర్పంచులు ప్రతి గ్రామాన్ని ఎప్పటికప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు ఖాజపాష, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ప్రధానకార్యదర్శి కృష్ణారెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు శ్యామ్‌రెడ్డి, వీరయ్య, రఫీక్ పాష, భాస్కర్‌గౌడ్, శివభాస్కర్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

ఒక్క ఎకరాకు సాగునీరు ఇవ్వలేదు

మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

మర్పల్లి: నీళ్లు, నిధులు, నియామకాలు వంటి ఆకాంక్షలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం మాత్రమే దోచుకుంటుందని మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ చంద్రశేఖర్ ఆరోపించారు. ఆదివారం మర్పల్లి మండల పరిధిలోని కొత్లాపూర్, కుడుగుంట, కల్‌కోడ, దామస్తాపూర్, కోట్‌మర్పల్లి, ఘణాపూర్ గ్రామాల్లో బీజేపీ పార్టీ శ్రేణులు ప్రజాగోసా, బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ సమావేశాలను నిర్వహించారు. కోట్‌మర్పల్లి గ్రామంలో ఆ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు అవుతున్నా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఏ ఒక్క ఎకరాకు సాగు నీరు అందించిన దాఖలు లేవని మండిపడ్డాడు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంను రూ.లక్షల కోట్లు అప్పుచేసి పేద ప్రజలపై భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా నాయకులు రామేశ్వర్‌రెడ్డి, మోమీన్‌పేట్, మర్పల్లి పార్టీ ఇన్‌చార్జిలు సురేష్, శ్రీనివాస్, దళితమోర్చా మర్పల్లి మండల అధ్యక్షుడు జైపాల్, కోట్‌మర్పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, నాయకులు ఉన్నారు.

మేకల మందపై కుక్కల దాడి

కద్లాల్: మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో పది మేకలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఈ మేరకు విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, రాధాకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ.10వేల చొప్పున బాధితుడు పడకంటి కృష్ణయ్యకు ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గోపాల్, రైతు బంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉప సర్పంచ్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మీకన్ననాయక్, వార్డు సభ్యులు, నాయకులు లింగం, మల్లేశ్, ప్రమీల, సర్యా, యాదగిరి, ధర్మ, భాస్కర్, శ్రీను, జితేందర్‌రెడ్డి, సాయికుమార్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న జెడ్పీటీసీ దశరథ్